క్లుప్తంగా

రేపు మాంసం షాపులు బంద్ చేయాలి

సూర్యాపేట అర్బన్ : అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా సూర్యాపేట పట్టణంలో మటన్, చికెన్, చేపలు షాపులను బంద్ చేయాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.హనుమంత రెడ్డి అన్నారు. ఈ విషయమై పట్టణంలోని మటన్, చికెన్, చేపలు, హోటల్స్, బార్స్, రెస్టారెంట్ వారికి నోటీసులు అందజేసినట్లు తెలిపారు. షాపుల యజమానులు ఎవరైనా మాంసాహార ఉత్పత్తులను విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చివ్వెంల తహసీల్దార్‌గా చంద్రశేఖర్



చివ్వెంల : మండల నూతన తహసీల్దార్‌గా జి.చంద్రశేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న టి. ప్రకాశ్ రావు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మ, ఆర్ఐలు శ్రీనివాస్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

దసరాను ప్రశాంతంగా జరుపుకోవాలి

నాగారం : దసరా ఉత్సవాలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని నాగారం ఎస్ఐ ఎస్‌కె.యాకూబ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో మంగళవారం పూర్వ విద్యార్థుల సౌజన్యంతో కామినేని ఆసుపత్రి వైద్యసిబ్బందిచే ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బింగి కృష్ణమూర్తి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, సుతారపు సోమశేఖర్, అమృతం, చింత నర్సయ్య, కుంభం సత్తయ్య, నిమ్మల సోమయ్య, శిగ నసీర్‌గౌడ్, వల్లాల ఖాజ, జె.రాంప్రసాద్, కొరపిడత నరేష్, మామిడి అనిల్, కె.రాములు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్ఐ

అత్మకూరు (ఎస్) : మండలంలోని ఏపూర్ గ్రామంలో దసరా సందర్భంగా దాతల సహకారంతో కబడ్డీ టీం యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి కబడ్డీ క్రీడలను మంగళవారం ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుడిగ లింగయ్య, పరికపల్లి వెంకటేష్, దామిడి రాజు, సానబోయిన సుధాకర్, ఉపేందర్, షరీఫ్, రవి, నాగయ్య, మురళి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడం గ్రామానికి చెందిన రాజశేఖర్ అనారోగ్యం కారణంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో రూ.19వేల చెక్కు మంజూరైంది. ఆ చెక్కును మంగళవారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మద్దెల రాములుగౌడ్ లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దెల భిక్షపతి, ముసిగుంపుల యాకయ్య, నాగేష్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

అర్వపల్లి : మండల పరిధిలోని పర్సాయపల్లి రహదారిలో ఎస్సారెస్పీ కాలువ బ్రిడ్జిపై గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. అప్రోచ్ రోడ్డుతో పాటు బ్రిడ్జి పై గుంతల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రదేశంలో వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి.. మరమ్మతులు చేయించి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



పర్సాయపల్లి రహదారిపై బ్రిడ్జి పైభాగంలో ఏర్పడిన గుంతలు, నిలిచిన నీరు

కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి



చివ్వెంల : మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాధవ్



ఆత్మకూర్ (ఎస్) : మాట్లాడుతున్న అధికారులు



అర్వపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో..

చివ్వెంల : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలుచేయాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు 48 గంటల్లోగా తీసివేయాలని, రాజకీయ జెండాలు, దిమ్మెలను మూసివేయాలన్నారు. పోలీసు డిపార్ట్‌మెంట్ నుంచి సహాయం తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, మౌలిక వసతులను పర్యవేక్షించాలని అన్నారు. మండల వ్యాప్తంగా సెక్షన్ 104 అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ సంతోష్ కుమార్, డీటీ పద్మ, ఆర్ఐలు శ్రీనివాస్, శ్రావణి పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : స్థానిక సంస్థల ఎన్నికలలో ఎన్నికల కమిషన్ సూచనలపై మండల పరిషత్ కార్యాలయంలోఎంపీడీఓ హసీం, తహసీల్దార్ అమీన్ సింగ్, ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎన్నికల నిబంధన ప్రకారం గోడలపై పార్టీలకు సంబంధించి రాసిన రాతలను, ప్రచారాలను తొలగించాలని తెలిపారు. జెండాలు, పార్టీల దిమ్మెలు, నాయకులు, నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని అన్నారు. గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులు మూసివేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, నలుగురు కంటే మించి గుమికూడినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు, జీపీఓలు పాల్గొన్నారు.

అర్వపల్లి : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించేలా సంబంధిత అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్ కోరారు. ఎన్నికల నియమావళికి సంబంధించి మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో రాజకీయపార్టీల ఫ్లెక్సీలు తొలగించాలని అన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు కోడ్ అమలులో ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ గోపి, ఎస్ఐ ఈట సైదులు, గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని ఎంపీడీఓ జానయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించొద్దని సూచించారు. నియమావళి ఉల్లంఘించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, ఎస్ఐ గోపికృష్ణ, ఎంపీఓ రాజేశ్వర్ పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. ప్రయాణికుల చింత



ఇమాంపేట మోడల్ స్కూల్ వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత

సూర్యాపేట – గరిడేపల్లి ప్రధాన రహదారి గుంతలమయమైంది. వర్షాలకు రోడ్డంతా దెబ్బతిని అడుగుకో గుంత అన్నతీరుగా మారింది. వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే నరకం చూస్తున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట



హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఏర్పడిన గుంతలు

పారిశుద్ధ్య కార్మికులకు వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి , సిబ్బంది

సూర్యాపేట : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, కార్యాలయ సిబ్బందికి మంగళవారం ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. జిల్లా ఆరోగ్య శాఖ సహకారంతో జరిగిన ఈ హెల్త్ క్యాంపులో పారిశుద్ధ్య సిబ్బందికి వైద్యపరీక్షలు జరిపారు. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలు అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి మాట్లాడారు. పట్టణ శుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణ బాధ్యత మున్సిపాలిటీపై ఉందన్నారు. ఆరోగ్య శిబిరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రమ్య, డాక్టర్ హరి ప్రసాద్, డాక్టర్ సుశాంక్, సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్‌ఎంలు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ప్లాంట్ ఎదుట కార్మికుల ధర్నా



చిల్పకుంట్లలోని మిషన్ భగీరథ ప్లాంట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్లు

నూతనకల్ : పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మిషన్ భగీరథ కార్మికులు మంగళవారం మండల పరిధిలోని చిల్పకుంట్ల మిషన్ భగీరథ ప్లాంట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. రమేష్, బత్తుల హరికృష్ణ మాట్లాడారు. వేతనాలు చెల్లించాలని పలు దఫాలుగా నిరసన వ్యక్తం చేసినప్పటికీ యాజమాన్యం సరైన సమయంలో వేతనాలు అందించడం లేదని అన్నారు. వేతనాలు అందక పండుగ పూట తమ కుటుంబ సభ్యులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం ఆలోచించి వెంటనే వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో గ్రామాలకు నీటి సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రగతిశీల మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మొగుళ్ల గోపాల్, కూసు ఉప్పలయ్య, గంట రామకృష్ణ, చంద్రయ్య, సైదులు పాల్గొన్నారు.

మాదిగ సామాజిక వర్గానికే టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న పాల్వాయి బాలయ్య

మద్దిరాల : మద్దిరాల మండలానికి జెడ్పీటీసీ టికెట్‌ను ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించినందున అన్ని పార్టీలు కూడా మాదిగలకే టికెట్‌ను ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాల్వాయి బాలయ్య అన్నారు. మంగళ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ కులాలలో 90శాతం మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు. మద్దిరాల, నూతనకల్లు మండలాల జెడ్పీటీసీ అభ్యర్థిని, అదే విధంగా నూతనకల్లు ఎంపీపీ టికెట్‌ను అన్ని పార్టీలు కూడా మాదిగ కులానికి చెందిన వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఏకపక్షంగా మాదిగల ఉమ్మడి అభ్యర్థిని నిలబెడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ కొడిశాల లింగయ్య, గంగాధరి లక్ష్మీకాంత్, సీనియర్‌నాయకుడు రాంపాక సత్తయ్య, రాంపాక వెంకన్న, మూరగుండ్ల వీరయ్య, ఉపేందర్, కర్ణాకర్, ఉప్పలయ్య, విజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుకు పంట చేతికొచ్చేనా..



తొండ గ్రామంలో వర్షపు నీరు నిలిచి నల్లగా మారిన పత్తి చేను

తిరుమలగిరి : వర్షాలకు పత్తి చేలు దెబ్బతిని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలకు అధిక తేమతో చేలన్నీ నల్లబారి పత్తి కాయలు బూజు పట్టిపోతున్నాయి. నేలల్లో నీళ్లు నిలిచి ఉండటంతో చేలు ఎదగడం లేదని రైతులు వాపోతున్నారు. చేతికొచ్చిన కాయలు నల్లగా మారి కుళ్లిపోతున్నాయని తెలుపుతున్నారు. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టామని, కానీ పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని రైతులు అంటున్నారు. వర్షాల కారణంగా పత్తి తీయలేకపోతున్నామని తెలుపుతున్నారు. రైతులు ఈసారి తిరుమలగిరి మండలంలో 8110 ఎకరాలు, మద్దిరాల మండలంలో 6200 ఎకరాలు, నూతనకల్ మండలంలో 6050 ఎకరాలు, నాగారం మండలంలో 5820 ఎకరాలు, తుంగతుర్తి మండలంలో 3742 ఎకరాలు, జాజిరెడ్డిగూడెం మండలంలో 2123 ఎకరాలలో పత్తి పంటను సాగు చేశారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

తిరుమలగిరి : వెలిశాల గ్రామంలో అనారోగ్యంతో మరణించిన పుల్లూరి ముత్తమ్మ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుంభం సతీష్ గౌడ్ మంగళవారం పరామర్శించారు. మతురాలి కుటుంబానికి రూ.5000 నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, ఏపూరి అవిలయ్య, వీరమల్లు, యాకన్న, ఎల్లయ్య, వీరయ్య, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సైనికుడిలా పనిచేయాలి

మద్దిరాల : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎస్ఏ.రజాక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాలలో గెలిచే వారిని పార్టీ అభ్యర్థులుగా ఎంపిక చేసుకొని, వారిని గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వల్లపు యాకయ్య, దామెర్ల వెంకన్న, మాజీ ఎంపీటీసీ శిరంశెట్టి వెంకన్న, అవిలయ్య, వడ్లాణం మధుసూదన్, మల్యాల నర్సయ్య, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం

నూతనకల్ : క్షయ వ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీహెచ్‌ఓ శరణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, బరువు కోల్పోవడం, తెమడలో రక్త జీలలు, రాత్రి వేళల్లో జ్వరం ఉన్నట్లయితే వెంటనే సంబంధిత ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. ఈ సందర్భంగా 90మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమాంజలి, దీపిక, ఆనంద్‌గౌడ్, ప్రసాద్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

రోడ్లు తెగి.. క్వారీలు బంద్

- మూసీనదిలో వరదకు కొట్టుకపోయిన ఇసుక క్వారీ రోడ్లు
- రోజుల తరబడి ఇసుక సరఫరా నిలుస్తుండటంతో ఇబ్బందుల్లో ప్రజలు



తుంగగూడెం ఇసుక క్వారీలో వరదకు కొట్టుకపోయిన రోడ్డు

అర్వపల్లి : హైదరాబాద్‌తోపాటు ఎగువ ప్రాంతాల నుంచి మూసీనదికి భారీగా వరద వస్తుండటంతో ఇసుక క్వారీల రోడ్లు కొట్టుకపోయి ఇసుక సరఫరా నిలిచిపోయింది. జాజిరెడ్డిగూడెం మండలం తుంగగూడెం, నాగారం మండలం పేరబోయినగూడెం ఇసుక రీచ్‌లు మూసీనదిలో పక్కపక్కనే ఉంటాయి. అయితే వరదలకు ఈ రెండు రీచ్‌ల రోడ్లు కొట్టుకపోయాయి. గతంలో తుంగగూడెం రీచ్ కొట్టుకపోగా మరమ్మతు చేయించారు. మళ్లీ ఈ నెల 12న మరోసారి ఈ రీచ్ రోడ్డు కోతకు గురైంది. దీంతో అప్పటి నుంచి ఈ రీచ్‌లు బందయ్యాయి.

ఆగిన నిర్మాణాలు..

సూర్యాపేట, తుంగతుర్తి రెండు నియోజకవర్గాలకు ఎక్కువగా ఈ రెండు రీచ్‌ల నుంచే ఇసుక సరఫరా అవుతుంది. ఇక్కడి ఇసుక నాణ్యత బాగుండటంతో ఇక్కడి ఇసుక కోసం ఎక్కువగా ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు చేస్తుంటారు. అయితే ఈ రెండు క్వారీలకు సంబంధించి ప్రస్తుతం వేల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్ల కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్నారు. కానీ రోడ్లు తెగి సరఫరా నిలిచిపోతుండటంతో ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పనులు, ప్రైవేట్ నిర్మాణాలకు ఆటంకం ఏర్పడుతోంది. ప్రతిరోజు ప్రజలు ఇసుక కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగిపోతున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే వరద తగ్గితేనే రోడ్ల మరమ్మతు సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. కాగా ఇటీవల కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశాల మేరకు సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, స్థానిక తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్‌తో కలిసి క్వారీలను పరిశీలించారు. వరద వస్తుండటంతో పరిస్థితిని చూసి జిల్లా అధికారులకు తెలియజేశారు.

వరద తగ్గితేనే మరమ్మతులు



హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో మూసీనదికి వరద ఉధృతంగా వస్తోంది. అక్కడి నుంచి వచ్చే వరద తగ్గాక క్వారీలో రోడ్లు మరమ్మతు చేయించి ఇసుక సరఫరాను పునరుద్ధరిస్తాం.

– బాషపాక శ్రీకాంత్, తహసీల్దార్

కొనసాగుతున్న దుర్గామాత శరన్నవరాత్రోత్సవాలు



సూర్యాపేట : శ్రీసంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మద్దిరాల : కుక్కడం గ్రామంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సూర్యాపేట : దేవీ శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా 9వ రోజు పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో మంగళవారం శ్రీసంతోషిమాత అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకుడు భట్టారము వంశీకృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు జరిపారు. అమ్మవారి సన్నిధిలోని శ్రీ చక్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీ హోమం, రుద్ర హోమం, సౌందర్యలహరి, శివానందలహరి పారాయణం, బ్రాహ్మణ ముత్తయిదువులకు సుహాసిని పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రామమూర్తి, ఉప కోశాధికారి కొత్తా మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు నరేంద్రుని విద్యాసాగర్ రావు, పబ్బా ప్రకాశరావు, బెలిదే అశోక్, దేవరశెట్టి సోమయ్య, గోపారపు రాజు, బ్రాహ్మణపల్లి సంతోష్ కుమార్, దేవి దత్తు, పగిల రమాదేవి, నూనె యుగంధర్, ఉగ్గం యాకమ్మ, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు దుర్గామాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. కుక్కడం గ్రామంలో దుర్గామాత విగ్రహం వద్ద కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వరదరాజు కన్నయ్య, భక్తులు శిలివేరు చిరంజీవి, లింగయ్య, కాశీం, సాగర్, నర్సయ్య, నరేష్, యాకస్వామి, మల్లం సతీష్, శివ, సాయిగౌతమ్, జ్ఞానేశ్వర్, గణేష్, చందు తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్‌లో పూజలు చేస్తున్న తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి

తిరుమలగిరి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారు దుర్గామాతగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

నాగారం : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పసునూర్, పస్తాల, ఫణిగిరి, నాగారం, నాగారంబంగ్లా, వర్ధమానుకోట, మాచిరెడ్డిపల్లి, ఈటూరు, డి.కొత్తపల్లి తదితర గ్రామాల్లో దుర్గామాత విగ్రహాల వద్ద భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కాశీ వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

అర్వపల్లి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జాజిరెడ్డిగూడెం, తిమ్మాపురం తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో దేవీ నవరాత్రోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో భక్తుల పూజలు..



తిరుమలగిరిలో పూజలు..



నాగారం : మాచిరెడ్డిపల్లిలో..

బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా

కోదాడ : ఉద్యోగులు తాము పనిచేస్తున్న కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పచ్చదనానికి ప్రాముఖ్యత ఇవ్వాలని కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం కోదాడ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్, మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి కార్యాలయ ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం ఆవరణలో మొక్కలను నాటారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కార్యాలయ ఆవరణలో అన్ని రకాల మొక్కలను నాటుతామని బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజన్ ఇంజనీర్ కాసాని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, పర్యావరణ ఇంజనీర్ భవాని, బీఎస్ఎన్ఎల విశ్రాంత ఉద్యోగులు జాఫర్‌తో పాటు బీఎస్ఎన్ఎల్ సిబ్బంది, మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది, బీఎస్ఎన్ఎల్ కార్‌స్టాండ్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి మంగళవారం స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో చెన్నకేశ్వాపురానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మిరియాల వెంకటయ్య, విజయలక్ష్మి దంపతులు రూ.10వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భవురిశెట్టి వెంకటరత్నం, కార్యదర్శి కొండ వెంకట సత్యనారాయణ గుప్త, కోశాధికారి వందనపు సూర్యప్రకాషరావు, దయాకర్ పాల్గొన్నారు.